## ధాన్యం కొనుగోళ్లు షురూ..

### ఆలూరులో ప్రారంభించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కిశోర్‌కుమార్

సారంగాపూర్, ఏప్రిల్ 1 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి, గిట్టుబాటు ధర పొందాలని రైతులకు రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. సోమవారం ఆలూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం క్వింటాలు గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2,203.. గేడ్ర్-బీ ధాన్యానికి రూ.2,183 మద్దతు ధర ప్రకటించిందన్నారు. దళారులకు అమ్మితే తూకంలో తేడా, ధరలో దగా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీవో నర్సయ్య, డీఎస్‌వో నందిని, డీఎం శ్రీకళ, ఏవో రాజశేఖర్‌రెడ్డి, ఏపీం మాధురి, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రమాదేవి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వరుడికి అరుదైన కానుక

### ఎడ్లజత, ఆవు ఇచ్చిన వధువు బంధువులు



ఎడ్లజత, ఆవును కానుకగా అందిస్తున్న వధువు బంధువులు

నార్నూర్, ఏప్రిల్ 1 : సుంగపూర్ పంచాయతీ పరిధిలోని కొలాంగూడకు చెందిన సిడాం భూరిబాయి-భీంరావ్ దంపతులు ఆదివారం తమ కుమార్తె సిడాం లక్ష్మీబాయిని బేల మండలంలోని సైద్‌పూర్ చిన్నిగూడకు చెందిన ఆత్రం అనిత-కాను దంపతుల కుమారుడు ఆత్రం రాజుతో వివాహం జరిపించారు. భీంరావ్ తన అల్లుడికి కట్న కానుకలు కాకుండా ఎడ్లజత, ఆవును అందించాడు. ఈ తరంలో కట్న కానుకలు రూపు మాపేందుకు ఆదివాసీ సమాజం ముందుంటుందని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా ఈ వీడియో సామాజిక మధ్యమాల్లో చక్కర్లు కొడుతుండడం నెటిజన్లు పెళ్లి కూతురి తల్లిదండ్రులను అభినందిస్తున్నారు.



కాప్రిలో మిర్చి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## రైతులను మోసగించిన కాంగ్రెస్

### మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఏప్రిల్ 1 : రుణమాఫీ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మభ్యపెడుతున్నాడని మాజీ మంత్రి జోగు రామన్న తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం నీరు అందక ఎండిపోతున్న మిర్చి, జొన్న పంటలను కాప్రి, ఉమ్రి, కరంజీ గ్రామాల రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుతున్న ఎండలకు బావులు, బోర్లు, వాగుల్లో నీరు అడుగంటి పోయిందన్నారు. దీనిపై ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్నారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క కేవలం కాంగ్రెస్ పార్టీలో చేరికలకే పరిమితం అయిందని విమర్శించారు. రైతులు పండించిన సోయ, శనగ ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్ల వాన, వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ ఏ మైందని ప్రశ్నించారు. జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లింగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి..

ఇచ్చోడ, ఏప్రిల్ 1 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలాభివృద్ధితోపాటు పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ మల్లేశ్ పాల్గొన్నారు.

# పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

## గురుకులంలో ఎప్‌సెట్, నీట్, జేఈఈ మెయిన్స్‌లో తర్ఫీదు

- సోఫినగర్ కళాశాలలో 80 విద్యార్థులకు నైపుణ్య తరగతులు
- అనుభవం, నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన
- వసతి, భోజనం, ఇతర సకల సౌకర్యాల కల్పన
- ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రాసే విధానం, ఆఫ్‌బిట్స్‌పై శిక్షణ
- గ్రాండ్, స్లిప్ టెస్టుల నిర్వహణ



గురుకుల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 1 : ఎప్‌సెట్(ఇంజినీరింగ్,అగ్రికల్చర్ అండ్ ఫార్మసి కామన్ ఎంట్రన్స్ టెస్ట్), నీట్(నేషనల్ ఎలిజిబులిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్), జేఈఈ(జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) మెయిన్స్‌లో విద్యార్థులు ర్యాంకులు సాధించేలా గురుకులాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. నిర్మల్ పట్టణంలోని సోఫీనగర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 45 రోజులపాటు ప్రత్యేక తర్ఫీదు ఏర్పాటు చేశారు. అనుభవం, నిష్ణాతులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థుల్లో మెరుగైన వారిని ఎంపిక చేసి రోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. గణితం, రసాయన, జీవ శాస్త్రాలు, ఇతర సబ్జెక్టులను బోధిస్తున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు.

### రోజు గ్రాండ్, స్లిప్ టెస్టులు

పదేండ్ల నుంచి ఎంసెట్, నీట్‌లో వస్తున్న ప్రశ్నలు, వాటి సమాధానాలు, ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రాసే విధానం, ఆఫ్‌బిట్స్ బోధిస్తున్నారు. గ్రాండ్, స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ వెనుకబడ్డ విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటున్నారు. వేసవి సెలవుల్లో ఇటువంటి శిక్షణ ఇవ్వడం ప్రయోజనకరంగా ఉందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఉచితంగా శిక్షణ, మంచి భోజనం, ఇతర సౌకర్యాలు, మానసిక వికాసానికి ఆటలు.. ఇలా అన్ని విధాలుగా శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణను ప్రైవేట్‌లో తీసుకోవాలంటే ఒక్కో విద్యార్థికి కనీసం రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. గురుకులంలో ఉచితంగా ఇస్తున్న ఈ శిక్షణ పేద విద్యార్థులకు వరంగా మారింది.

### ప్రత్యేక శిబిరంలో శిక్షణ



గురుకుల కళాశాలలో చదివే విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. మెరిట్ సాధించేలా యేటా ఎప్‌సెట్, నీట్, జేఈఈ మెయిన్స్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. దీంతో విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాస్తారు. మంచి ర్యాంకులు సాధించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడనుంది. నాణ్యమైన భోజనం, నిపుణులతో బోధన, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. తిరోజు స్లిప్ టెస్టులు నిర్వహించడం వల్ల మనోధైర్యం పెరుగుతోంది. *- గంగా శంకర్, ప్రిన్సిపాల్.*

### మంచి ర్యాంకులు వచ్చాయి..



ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ చదివిన విద్యార్థులకు ఎప్‌సెట్, నీట్, జేఈఈ మెయిన్స్ సాధిం చేందుకు 45 రోజులపాటు తర్ఫీదు ఇస్తున్నాం. ఇప్పటివరకు విద్యార్థులు నేర్చుకున్న వాటితోపాటు కొత్త అంశాలు నేర్పిస్తున్నాం. అన్ని సబ్జెక్టుల్లో అనుభవం ఉన్న అధ్యాపకులు శిక్షణ ఇస్తుండడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. *- దీపక్, శిక్షకుడు, నిర్మల్.*

### ఖర్చులు తప్పాయి..



గురుకులాల్లో చదువుకోవడం వల్ల మంచిదైతంది. నాది ఇంటర్ పూర్తయింది. ఎప్‌సెట్, నీట్‌లలో శిక్షణ తీసుకోవాలనుకున్న. మా గురుకులంలోనే శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని సంబురపడ్డ. మేము పేదోళ్లం. బయట శిక్షణ తీసుకునేంత ఆర్థిక స్థోమత లేదు. ఖర్చులు తప్పాయి. శిక్షణ తీసుకుని, బాగా చదివి ర్యాంకు సాధిస్తాననే నమ్మకం ఉంది. *- అవనిక, ఎంపీసీ, నిర్మల్.*

### ఆత్మవిశ్వాసం పెరుగుతోంది..



నేను ఇప్పుడే ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న. ఇంటర్ తర్వాత రాసే నీట్ పరీక్షకు మా గురుకులంలో తర్ఫీదు ఇస్తున్నారు. చాలా సంతోషం. నేను కూడా శిక్షణ తీసుకుంటున్న. దీంతో పరీక్ష ఎలా రాయాలో తెలుస్తున్నది. ద్వితీయ సంవత్సరంలో కూడా మళ్లీ శిక్షణ తీసుకుంటా. ఫలితంగా ఏదీ ఎలా రాయాలో తెలుస్తది. ఏం ప్రిపేర్ కావాలో తెలుసుకోవచ్చు. *- సువర్చల, బైపీసీ, నిర్మల్.*




ఉపాధ్యాయులు రాకపోవడంతో పాఠశాల బయట ఉన్న విద్యార్థులు

## ఉపాధ్యాయులు డుమ్మా

- వారంలో రెండు రోజులు గైర్హాజరు
- మంచినీరు లేదు.. మధ్యాహ్న భోజనం లేదు..
- పాఠశాల ఆవరణలో తిరుగుతున్న విద్యార్థులు
- 'నమస్తే తెలంగాణ' విజిట్‌తో బట్టబయలు

పెంబి, ఏప్రిల్ 1 : ఇటిక్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 34 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదో తరగతి వరకు ఉండగా.. సురేశ్, అనిల్ అనే ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ డిప్యూటేషన్‌పై మందపల్లి పాఠశాలలో బోధిస్తున్నాడు. సురేశ్ అనే ఉపాధ్యాయుడు వారానికి రెండు రోజులు పాఠశాలకు రావడంలేదని స్థానికులు తెలిపారు. సోమవారం పాఠశాలను 'నమస్తే తెలంగాణ' సందర్శించగా 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. సురేశ్ బడికి రాలేదు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించకపోవడంతోపాటు కనీసం మంచి నీటి సౌకర్యం కూడా లేదు. అలాగే మంగళవారం కూడా ఎన్నికల శిక్షణ ఉన్నదని పాఠశాలకు సెలవు ప్రకటించినట్లు ఉపాధ్యాయుడు ఇతరులతో విద్యార్థులకు సమాచారం అందించాడు. సురేశ్ పనితీరుపై స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో మధుసుదన్, కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగాధర్‌లను వివరణ కోరగా.. ఉపాధ్యాయుడు సురేశ్ సెలవుపై వెళ్తునట్లు తమకు లెటర్ అందించలేదని, విచారణ చేపట్టి ఉపాధ్యాయుడిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనిల్ అనే ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై మందపల్లిలో బోధిస్తున్నట్లు వెల్లడించారు. ఉన్నత అధికారులు స్పందించి డిప్యూటేషన్‌ను రద్దుచేసి, ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుడి కుర్చీ



ఎండలో ఆడుకుంటున్న విద్యార్థులు

## ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి..

### నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 1 : ఎన్నికల నిర్వహణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అధికారులకు సూచించారు. సెయింట్ థామస్ పాఠశాలలో పీవోలు, ఏపీవోలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల ప్రాధాన్యతను ప్రతి ఉద్యోగి తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. పోలింగ్, ఈవీఎం యంత్రాల పనితీరు, వీవీ ప్యాడ్స్, కంట్రోల్ యూనిట్స్, మాక్ పోలింగ్ అంశాలపై తెలుసుకోవాలన్నారు. ఎన్నికల సామగ్రి, నోటీసు బోర్డులు, ఫారాలు, పోస్టల్ బ్యాలెట్ విధానంపై వివరించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్వో భుజంగ్‌రావు పాల్గొన్నారు.

### వడదెబ్బ నివారణపై చైతన్యం కలిగించాలి..

ఎండలు రికార్డు స్థాయిలో ఉండడంతో ప్రజలు, పశువులు ఎండల నుంచి రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎండల నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు కిశోర్‌కుమార్, ఫైజాన్‌అహ్మద్, అధికారులు ధన్‌రాజ్, శంకరయ్య, సందీప్, విజయలక్ష్మి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, అశ్వక్ అహ్మద్ పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి లేకుండా చూడాలి..

**- రవీంద్రనగర్ తండా సందర్శన**

సారంగాపూర్, ఏప్రిల్ 1 : గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం రవీంద్రనగర్ తండాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్‌ట్యాంక్‌లు, నిరంతర విద్యుత్ సరఫరా ఎలా జరుగుతున్నదని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. కరెంట్ సమస్య ఉందని తండావాసులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రకాశ్ చేస్తున్న వాటర్ టెస్టును పరిశీలించారు. ఇందులో డీపీవో శ్రీనివాస్, ఎంపీవో తిరుపతిరెడ్డి, మిషన్ భగీరథ జేఈ సందీప్, పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొన్నారు.



సారంగాపూర్ : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

## నీటి ప్రణాళికలు అందించండి..

- ట్యాంకర్స్ ద్వారా సరఫరా చేయాలి..
- నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు
- కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా



సమావేశానికి హాజరైన అధికారులు

ఎదులాపురం, ఏప్రిల్ 1 : తాగునీటి సమస్య ఉన్నచోట ట్యాంకర్స్ ద్వారా నీటిని సరఫరా చేయాలని, ఇందుకు సంబంధించిన వేసవి ప్రణాళికను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, లేబర్ మొబిలైజేషన్, స్కూల్ డ్రెస్సెస్ స్టిచింగ్, పోస్టల్ పేమెంట్, పీఎంకేఎస్‌వై వర్క్ ప్రొగ్రెస్, నర్సరీలపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తీవ్ర నీటి ఎద్దడి ఉన్నచోట ట్యాంకర్స్ ద్వారా నీటిని సరఫరా చేయాలని, బోర్లు, ఓపెన్ బావుల గురించి మండలాలవారీగా ఎంపీడీవో, ఎంపీవో, ఏఈలను అడిగి తెలుసుకున్నారు. బోరు బావులు, తాగునీటి వనరులను పునఃరుద్ధరించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు రానిచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ


అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల పనులను పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పేయింటింగ్ వంటి వసతుల గురించి తెలుసుకున్నారు. చేపట్టాల్సిన పనుల గుర్తించి కమిటీ తీర్మానాలు చేసుకోవాలని తెలిపారు. నర్సరీలు, స్కూల్ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్షలో ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్‌డీఏ సాయన్న ఉన్నారు.



డీ-28 కాలువకు పడ్డ గండిని పూడ్చుతున్న రైతులు

## గండికి రైతుల మరమ్మతులు

పెంబి, ఏప్రిల్ 1 : మందపల్లిలోని కొత్త చెరువుకు ఎస్సారెస్పీ డీ-28 ద్వారా సాగు నీరు అందుతున్నది. ఈ డీ-28 కెనాల్‌కు ఖానాపూర్ మండలంలోని సింగాపూర్ వద్ద గండిం ది. దీంతో చెరువులోకి సాగునీరు రాక ఎండింది. గండిని పూడ్చి సాగు నీరందించాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. పంటలు ఎండిపోయే ప్రమాదముందని సోమవారం కొత్త చెరువు ఆయకట్టు రైతులందరితోపాటు వైస్ ఎంపీపీ గంగారెడ్డి సింగాపూర్ వద్ద డీ-28 కాలువకు మరమ్మతు చేపట్టారు. సాగు నీరు వృథాగా పోతూ.. చెరువు ఎండినా అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నాగోబా ఆలయంలో నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌మాయి

## నాగోబాను దర్శించుకున్న అదనపు కలెక్టర్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 1 : కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయాన్ని నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్‌మాయి సందర్శించారు. సోమవారం నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ మేనేజర్ రాంబాబు, నాగోబా ఆలయ పూజారి మెస్రం షేకు పాల్గొన్నారు.

## భగీరథ నీరు వచ్చేసింది..

**- 'నమస్తే' కథనానికి స్పందన**

తాంసి, ఏప్రిల్ 1 : లీంగూడ, అట్నంగూడ, గిరిగామ గ్రామాల్లో భగీరథ నీరు రావడం లేదని సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి చర్యలు చేపట్టారు. సోమవారం గిరిగామ, లీంగూడ గ్రామాలకు భగీరథ నీటిని అందించారు. అదేవిధంగా అట్నంగూడ గ్రామంలో కూడా భగీరథ నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



లీంగూడలో నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

## నగదు సీజ్

జైనథ్, ఏప్రిల్ 1 : భోరజ్ ఎక్స్ రోడ్డు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఎస్సై పురుషోత్తం ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో రూ.3,06,300 పట్టుకున్నారు. ఎస్సై కథనం ప్రకారం.. జైనథ్‌కు చెందిన పి.శ్రీనివాస్ మ్యాక్స్(ఏపీ01వై 1369)లో ఆదిలాబాద్ నుంచి జైనథ్ వైపు వెళ్తుండగా వాహనాన్ని తనిఖీ చేశాము. ఈ క్రమంలో ఆయన దగ్గర ఉన్న రూ.3,06,300లను స్వాధీనం పర్చుకున్నాం. కటిక వ్యాపారి అయిన శ్రీనివాస్ ఇచ్చోడ మార్కెట్‌లో మేకలను విక్రయించి వస్తున్నాడు. డబ్బులకు సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ ముత్యంరావుకు అప్పటించాము. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ నరేశ్, హోంగార్డు అనిల్, డ్రైవర్ జహీర్ పాల్గొన్నారు.



నగదును పట్టుకున్న జైనథ్ ఎస్సై పురుషోత్తం